క్లుప్తంగా

ప్రొఫెసర్ ఖాసీం నియామకంపై హర్షం

బొంరాస్‌పేట: ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ చింతకింది ఖాసీం నియామకంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యారంగంలో ఉన్నతంగా ఎదుగుతున్న ఖాసీంను చూసి గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ తాలూకా అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు రమేశ్‌బాబు, సంఘం తాలూకా నాయకులు తెలంగాణ జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య, తదితరులున్నారు.

పేదలకు అండగా ఉంటాం

కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

దోమ: పేదలకు అండగా ఉంటామని కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోత్కూర్‌లో కారుకొండ లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమె మృత దేహానికి నివాళులర్పించిన అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరమర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లింగయ్య, గుణప్ప, యాదయ్య. కైసర్, సతీశ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ జాతరకు 120 మంది బందోబస్తు

సీఐ రఘురాం

ధారూరు: మెథడిస్ట్ క్రిస్టియన్ జాతరలో 120మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ధారూరు సీఐ రఘురాం తెలిపారు. వీరిలో ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, హోంగార్డులు 120మంది బందోబస్తులో ఉన్నట్లు తెలిపారు. జాతర ప్రాంగణం, ఇతర ప్రాంతాల్లో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పాటు నిరంతర నిఘా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మండల పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థాన క్షేత్రం చుట్టూ శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో శోభాయమానంగా మారింది.

కొనసాగుతున్న సర్వే



కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్

పెద్దేముల్: మండల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే ప్రశాతంగా కొనసాగుతోంది. శుక్రవారం మారేపల్లి, ఇందూరు, తట్టెపల్లి, పెద్దేముల్, గాజీపూర్, బుద్దారం, గోపాల్‌పూర్, మంబాపూర్, కందనెల్లితో పాటు పలు గ్రామాలల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు. సర్వే తీరును మండల అధికారులు పరిశీలిస్తున్నారు. రైతులు పంట పత్తి ఏరేందుకు వెళ్తుండడంతో వివరాలు చెప్పేవారు లేకు ఎన్యుమరేటర్లు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సరిపడా ఫారంలు ఉన్నాయని ఎంపీడీఓ జర్నప్ప తెలిపారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

అనంతగిరి: ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కౌన్సిలర్ గోపాల్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేసి పలు సూచనలిచ్చారు. వైద్యులు ఓబులేష్, సందీప్, నవీన్, నర్సింలు, అనంతరాములు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

మొయినాబాద్: సాంకేతిక రంగ విద్యార్థులు సామాజిక పరమైన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ది హ్యాకింగ్ స్కూల్ ఫౌండర్ మిరాజ్ ఫహీం అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 'సహయోగ్ 2.0' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించే ఎంటర్‌ప్రైనర్‌షిప్ సమిట్ శుక్రవారం ప్రారంభమైంది.



వికారాబాద్ రాఘవేంద్ర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అనంతగిరి: బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద..



అనంతగిరి: వికారాబాద్ రాఘవేంద్ర స్వామి ఆలయంలో యువతులు, చిన్నారులు



తాండూరు: వినాయక ఆలయంలో..

కార్తీక శోభ

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే కార్తీక దీపాలు వెలిగిస్తూ మహిళలు భక్తిని చాటుకున్నారు.

ఆలయాలు విద్యుత్ దీపాల అలంకరణలో కార్తీక శోభను సంతరించుకున్నాయి.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు: కాళికాదేవి ఆలయంలో పల్లకీసేవ



తాండూరు: భీమ శంకర అలంకరణలో భావిగి భద్రేశ్వర స్వామి



కొడంగల్ రూరల్: శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించిన భక్తులు



దుద్యాల్: కొడంగల్ కేశవ స్వామి దేవాలయంలో..

గ్రూప్-4లో మండలవాసుల సత్తా



కటికె రాజు



కాట్రవత్ చక్రధర్



మూడవత్ బోప్యా



పిడుగు శ్రీనివాస్

కుల్కచర్ల: టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో ముగ్గురు మండల వాసులు సత్తాచాటారు. మండల కేంద్రానికి చెందిన కటికె రాజు, మక్త వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాట్రవత్ చక్రధర్, ముడావత్ బోప్యాలు ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆయా గ్రామాల ప్రజలు వారిని ఘనంగా సంప్రదించారు.

గౌరారం వాసికి అబ్కారీశాఖలో..

దుద్యాల్: ఇటీవల విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన పిడుగు శ్రీనివాస్ ఉద్యోగం సాధించాడు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ సాధనకు హైదరాబాద్‌లో ఉంటూ ప్రిపేర్ అయ్యానని.. తన అన్న తిరుపతయ్య ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. అబ్కారీశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

ప్రభుత్వ భూమిలో మైనింగ్

చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్

పరిగి: అధికారుల అండదండలతో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మైనింగ్ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని రంగాపూర్‌లో ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ వ్యాపారం జరుగుతుందని సమాచారం మేరకు సీపీఐ నాయకులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం పీర్ మహ్మద్ మాట్లాడుతూ.. అధికార పార్టీకి కొందరు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. రంగాపూర్ సమీపంలోని సర్వేనంబర్ 50లో ప్రైవేటు వ్యక్తులు మైనింగ్ వ్యాపారం చేస్తున్నారని.. పట్టణ కేంద్రానికి మట్టిని తరలించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశబూరు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మైనింగ్ జరుగుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఫార్మా బాధితులకు పరామర్శ



రోటిబండ తండాలో గిరిజనులను పరామర్శిస్తున్న మహిపాల్

దుద్యాల్: లగచెర్లలో అధికారులపై జరిగిన దాడి తర్వాత ఫార్మా బాధిత కుటుంబాలను సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ శుక్రవారం పరామర్శించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ పేరుతో రైతులను ప్రభుత్వం ఇబ్బందులను గురి చేస్తోందన్నారు. పోలీసుల వేధింపులకు ఆయా గ్రామాల యువత ఊరు విడిచి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారన్నారు. ఇళ్ల వద్ద మహిళలు, చిన్న పిల్లలు బిక్కుబిక్కుమంటు రోజులు గడుపుతున్నరన్నారు. తరతరాలుగా వారి భూముల్లో పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూముల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయడం తగదని, ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

ముందస్తు ప్రణాళికలతో సమస్యల పరిష్కారం



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్

మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్

పరిగి: పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని 8, 15వ వార్డుల్లో సాధారణ నిధులతో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతామన్నారు. ముందస్తు ప్రణాళికతో సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. త్వరలోనే పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు, నాయకులు మల్లేష్‌యాదవ్, నరేష్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల: మండలంలోని మీర్జాగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి మండలంలోని పలు పార్టీలకు చెందిన దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి రూ.51వేలు, చూగురి ప్రవీణ్‌రెడ్డి రూ.21వేలు, కుంచం శ్రీనివాస్ రూ.11వేలు, జి.మధుసుధన్‌రెడ్డి రూ.11వేలు, మచ్చేందర్ రెడ్డి రూ.5వేల విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని దేవనూరు, పేర్కంపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళారులను ఆశ్రయించి రైతులు మోస పోవద్దన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, నాయకులు హన్మంతు, అక్బర్‌బాబా, భీమయ్య, ఖాసీం తదితరులు ఉన్నారు.

చౌడాపూర్ మండల పరిధిలో..

కుల్కచర్ల: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని చౌడాపూర్, మరికల్, మల్కాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, నాయకులు దామోదర్ రెడ్డి, నర్సింహారెడ్డి, సలీం, రాజేందర్ రెడ్డి, శేఖర్, నీల్యానాయక్, రమేష్, ఖాదర్, రాములు, శ్రీకాంత్, నరేందర్, మన్యం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: దేవనూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కుల్కచర్ల: మరికల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కంకర రోడ్డుతో అవస్థలు

- పాడవుతున్న వాహనాలు
- ఆందోళనలో ప్రజలు

దౌల్తాబాద్: మండలంలోని కుప్పగిరి స్టేజీ నుంచి చంద్రకల్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గతేడాది సెప్టెంబర్ నెలలో అప్పటి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆర్నెళ్ల క్రితం పనులు షురువయ్యాయి. ఇందులో భాగంగానే సంబంధిత కాంట్రాక్టర్ నెల రోజుల క్రితం రోడ్డుపై కంకర వేయించి వదిలేశాడు. దీంతో కంకర రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుతో ద్విచక్రవాహనాలు, ఆటోల టైర్లు పాడవుతున్నాయని, రాత్రి వేళల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా పనులను ప్రాంభించాలని కోరుతున్నారు.



కంకర వేసి వదిలేసిన చంద్రకల్ రోడ్డు

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొంరెడ్డిపల్లిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులో 14,500 చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభ్యున్నతికి మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లలను అందజేస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలుచేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు ఏఎఫ్‌ఓ మునీందర్, ఏడీ వెంకన్న, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మి, మహేశ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు రాంచంద్రయ్య, బసయ్య, అనంతయ్య, ఆనందం, జలీల్, ఘనపూర్ శ్రీనివాస్, మొగులయ్య, కృష్ణయ్య, నర్సింహారెడ్డి, మొగులయ్య, బుగ్గయ్య పాల్గొన్నారు.



బొంరెడ్డిపల్లి చెరువులో చేపపిల్లలను వదులుతున్న నాయకులు, అధికారులు

ఎన్యుమరేటర్ల ఇబ్బందులు తొలగించండి

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గోపాల్

బొంరాస్‌పేట: సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ల ఇబ్బందులు తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వడిచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్ల పనిభారం తగ్గించాలన్నారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేక సర్వే ఆలస్యమవుతోందన్నారు. ఎన్యుమరేటర అభిప్రాయం మేరకు సర్వే గడువును పెంచాలని కోరారు. ప్రతీ ఎన్యుమరేటర్‌కు 50 కుటుంబాలనే కేటాయించాలన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు పునరాలోచించి ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు మల్లేశ్, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, నాయకులు అలీమొద్దీన్, రవి తదితరులున్నారు.



మాట్లాడుతున్న గోపాల్